క్లుప్తంగా

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం

పెళ్లకూరు: మండలంలోని ఎగువ చావలిలో నూతనంగా నిర్మించిన వినాయకస్వామి ఆలయం కుంభాభిషేక మహోత్సవం గురువారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి, గ్రామంలోని ప్రధాన వీధుల్లో చలువ పందిళ్లు వేశారు. మంగళ వాయిద్యాలు వేద మంత్రోచ్చారణల నడుమ కలశస్థాపన, విగ్రహప్రతిష్ట చేశారు. కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



మందిరంలో అన్నదానం చేస్తున్న దాతలు

ఓజిలి: మండలంలోని మానమాలలో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, హారతి, పూజలు, కాగడా హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయి సుజనారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. 300 మందికి అన్నదానం చేశారు. రాత్రి బాబా మందిరంలో సాయినాథునికి పల్లకీ సేవ నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ రేపు

చిల్లకూరు: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బహిరంగ సభను ఈ నెల 3న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు గురువారం ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. గ్రామాల వారీగా గత నెల 25వ తేదీ నుంచి ఉపాధి పనులకు సంబంధించి డీఆర్పీలు సామాజిక తనిఖీలు చేశారని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి, అక్కడ అభ్యంతరాలను తెలుసుకున్నారన్నారు. దీనిపై మండల ఆవరణలో జరిగే సామాజిక తనిఖీ బహిరంగ సభలో పనుల వివరాలను తెలియజేస్తారని ఆయన చెప్పారు.

చిల్లకూరు ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా రఘుబాబు

చిల్లకూరు: మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్‌గా నాయుడుపేటలో విధులు నిర్వహిస్తున్న చిల్లకూరు, చిట్టమూరు మండలాల మత్స్యశాఖ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారిగా తనని నియమించినట్లు గోను రఘుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా మత్స్యశాఖాధికారి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేలా చూడడంతో పాటుగా రొయ్యల సాగుదారులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రైతు భరోసాతో రూ.4.35 కోట్ల లబ్ధి

ఓజిలి: మండలంలో 2023–24 సంవత్సరానికిగాను రైతులకు మొదట విడతగా వైఎస్సార్ రైతు భరోసా రూ.7500 నగదు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో బటన్ నొక్కి ప్రారంభించారని వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఓజిలి మండలంలో 5,799 మంది రైతులకు రూ.4.35 కోట్లు నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. నగదు జమ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వెసులుబాటు కల్పించండి

కోట: విద్యానగర్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపులో రోడ్డు మార్జిన్ వ్యాపారులకు కొంత వెసులుబాటు కల్పించాలని గురువారం వారు తహసీల్దార్ పద్మావతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆమెకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ కోటలో ఆక్రమణలను తొలగించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ క్రమంలోనే విద్యానగర్‌లో కూడా ఆక్రమణలు తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారని, అయితే రోడ్డుకు 100 మీటర్ల వరకు తొలగించేందుకు మార్కింగ్ చేశారని, ఇలా చేయడం ద్వారా రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే ఎంతో మంది నిరాశ్రయులు అవుతారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తొలగింపుల్లో కొంత వెసులు బాటు కల్పించేలా మార్కింగ్‌ను తగ్గించాలని వారు కోరారు. తద్వారా తమకు జీవనోపాధి కలుగుతుందని చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఓజిలి: మండలంలోని కుందాం, తిరుమలపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు గురువారం తెలిపారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థతో ఆదర్శ పాలన



సేవారత్న అవార్డు పొందిన వలంటీర్లను అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): వలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన జరుగుతుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం బాలాయపల్లి మండలంలోని ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 166 మందికి సేవామిత్ర పురస్కారాలను పంపిణీ చేశారు. అంతకుముందు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా దేశంలో ఎక్కడాలేని విధంగా సచివాలయ వ్యవస్థను రూపొందించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మన్ననలు పొందుతున్నారని చెప్పారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, కరణం రమేష్‌నాయుడు, రంగనాథం, వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, పార్టీ మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, గోపీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జన శ్రేయస్సే లక్ష్యం

వెంకటగిరి: జనశ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సంతోషమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజకపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు బీసీ కాలనీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తెలియజేసిన డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రామయ్యను ఆదేశించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్, కౌన్సిలర్‌లు పి ప్రభావతి, ఎంఏ నారాయణ, కళ్యాణి, వహీదా, శ్రీనివాసులురెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం



డక్కిలి: లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: పేదలకు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. డక్కిలి సచివాలయ పరిధిలోని దేవునివెల్లంపల్లి పంచాయతీ కుప్పాయిపాళెం, వెంకటేశ్వరపురం, దేవునివెల్లంపల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ చింతపూడి సుజాత, స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయ చైర్మన్ నర్రావుల ప్రకాశంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్లూరు బాలకృష్ణ, శ్రీనివాసులు, పాదిలేటి దశరథరామిరెడ్డి, మాదమాల నారాయణరెడ్డి, వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు



గరుడ వాహనంపై ఆశీనులైన లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారు గురువారం రాత్రి బంగారు గరుడ వాహనంపై విహరించారు. ఉదయం స్వామివారి మూలమూర్తికి అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి పెంచలకోనలోని మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కోన వీధులు గోవింద నామస్మరణలతో మారుమోగాయి.

హనుమంతుడిపై కరిమాణిక్యస్వామి



స్వామివారికి ఊంజల్ సేవ జరుపుతున్న వేదపండితులు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని కరిమాణిక్యస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. హనుమంత వాహన సేవలో టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, కే రామకృష్ణారెడ్డి, కే మోహన్‌రెడ్డి, పీ గంగాప్రసాద్, నరసారెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుడ సేవ

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో ద్వార దర్శనం పూజలు నిర్వహిస్తారు. రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

కలువాయి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నెల్లూరు జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు, స్టేషన్ ఆవరణలో ఉన్న పట్టుబడిన వాహనాల గురించి ఆరా తీశారు. స్టేషన్ నిర్వహణ, ఎస్‌ఐ మహేంద్ర, పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పాదలకూరు–తిరుపతి బస్సు నడపాలి

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పాదలకూరు – తిరుపతి మార్గంలో బస్సు నడపాలని పాదలకూరు ప్రయాణికులు కోరారని డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ డిపోలో గురువారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఫోన్ చేసినట్లు చెప్పారు. పాదలకూరు–సంగం మార్గంలో ప్రతిరోజు బస్సులు నడపాలని, డేగపూడి వద్ద బస్సులు నిలపాలని, రాపూరు–తిరుపతికి అధిక బస్సులు నడపాలని ప్రయాణికులు కోరినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి అన్ని ప్రాంతాలకు బస్సులు నడిపేలా చర్యలు చేపడతామన్నారు.

ఎస్‌ఐగా రంగనాథ్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

రాపూరు: స్థానిక ఎస్‌ఐగా రంగనాథ్‌గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వింజమూరులో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్ నెల్లూరుకు బదిలీపై వెళ్లారు.

8న రాపూరు మండల అధ్యక్ష ఎన్నిక

నెల్లూరు(పొగతోట): రాపూరు ఎంపీపీ ఎన్నిక ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి తెలిపారు. ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానం భర్తీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీన రాపూరులో సమావేశం నిర్వహించాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 4వ తేదీలోగా మండల పరిషత్ సభ్యులకు నోటీసులు అందజేయాలన్నారు. 8న ఉదయం 11 గంటలకు అధ్యక్ష పదవికి సమావేశం నిర్వహించాలన్నారు. కోరం లేని పక్షంలో మరుసటిరోజు 9వ తేదీ ఉదయం 11 గంటలక సమావేశం నిర్వహించి అధ్యక్ష ఎన్నిక చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు.

హంస వాహనంపై ప్రసన్న వెంకన్న



హంస వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి

గూడూరు: స్థానిక రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, నివేదన, బలిహరణ, ఉత్సవాంత స్నపనం, మాఢ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం తదితర కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఉభయ కర్తలు మిద్దే వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, పద్మజ, శ్రీకిరెడ్డి శేషారెడ్డి, కల్పన దంపతులు, వంశీధర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ప్రత్యేక సదుపాయాలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ

సైదాపురం: ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రస్తుత వేసవిలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఏపీడీ శ్రీహరి రెడ్డి ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పని ప్రదేశాన్ని పరిశీలించి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పనులను చేయించాలన్నారు. కూలీలు పనిచేసే చోట్ల తప్పని సరిగా నీడతో పాటు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు సంఖ్య కూడా పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జిలో నీళ్లు.. ఇక్కట్లు



డీవీ సత్రంలోని బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు

దొరవారిసత్రం: గ్రామంలోని నిర్మించిన అండర్ రైల్వే బ్రిడ్జిలో ఇటీవల కురిసిన వర్షానికి నీరు చేరింది. ఆ నీరు పూర్తి స్థాయిలో తొలగించే చర్యలు చేపట్టలేదు. దీంతో బ్రిడ్జిలో రెండు అడుగుల వరకు నీరు నిలిచింది. దీంతో వాహనచోదకుల రాకపోకలు సాగించలేక ఇక్కట్లు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వారితో పాటు పాదచారులు ఆ బ్రిడ్జిల్లో రాకపోకలు సాగించలేక పోతున్నామని వాపోతున్నారు. వివిధ రకాల వాహనాలు రోజూ వందల సంఖ్యలో తిరుగుతూనే ఉంటారు. సంబంధిత అధికారులు ఆ నీరు తొలగించి రాకపోకలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వారంలోగా ఫ్లైఓవర్ పనులు ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎట్టకేలకు జీఓ విడుదలైందని, వారం రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు గురువారం తెలిపారు. ఇందుకు సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, ధనుంజయ రెడ్డి, ముత్యాలరాజు, రావత్, కృష్ణబాబు, ప్రద్యుమ్న తదితరులతోపాటు అన్ని శాఖల అధికారులను ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆటోనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రూరల్ మండలంలోని కాంద్ర, తిమ్మసముద్రం గ్రామాల చెరువులకు తెలుగుగంగ నీటి సరఫరా కోసం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిశామని చెప్పారు. ఈ పనులు కూడా మంజూరు కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట రూరల్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మనుబోలు కృష్ణయ్య తదితరులున్నారు.

రొయ్యల సాగు భూముల పరిశీలన



భూములను సర్వే మిషన్ ద్వారా పరిశీలిస్తున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో రొయ్యల గుంతలు సాగు చేసుకుంటున్నామని, తమకు ఆ భూములు తప్ప ఎలాంటి జీవనాధారం లేదని, ఆ భూములపై హక్కులు కల్పించేలా చూడాలని జిల్లా కలెక్టర్‌కు అంకులపాటూరు దళితులు వినతులు అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ దళితులు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించడంతోపాటుగా వాస్తవాలను గుర్తించి నివేదికలను ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ రెవెన్యూ సిబ్బందితో కలసి క్షేత్ర స్థాయిలో భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు చేసుకుంటున్న దళితుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆ భూముల స్థితిని రికార్డుల ద్వారా పరిశీలించి, ఎంత మేర ఒక్కొక్కరు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారనే విషయాలను కూడా సర్వేయర్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకులపాటూరు గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీలు అంకులపాటూరు రిజర్వాయర్ కింది భాగంలో ఒక్కొక్కరు సుమారుగా ఎకరా చొప్పున రొయ్యల గుంతలు సాగు చేస్తున్నారని దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలన చేస్తున్నామన్నారు. పూర్తి నివేదికలను త్వరలో కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆయన వెంట వీఆర్వో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వెంకటగిరి: అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని తిరుపతి చీఫ్ కన్వజరేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ఎన్ నాగేశ్వరరావు తెలిపారు. ఎంజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం తిరుపతి డివిజన్ వన సంరక్షణ సమితుల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులకు అవాసంగా ఉన్న అడవులు అనేక కారణాలతో అంతరించిపోతున్నాయన్నారు. అందువల్లే ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యప్రాణులు అటవీప్రాంతంలోని తోటల్లో తలదాచుకునేందుకు వచ్చే క్రమంలో పంటలకు నష్టం చేయడమే కాకుండా మనుషులపై దాడులకు తెగబడుతున్నాయన్నారు. ఈ పరిణామాలను అరికట్టేందుకు అడవుల సంరక్షణ ఒకటే మార్గమని తెలిపారు. ఇక వనసంరక్షణ సమితుల ద్వారా సాగు చేసిన జామాయిల్ చెట్లు కోతకు వచ్చిన వాటిని విక్రయించి, వచ్చిన నగదులో వీఎస్ఎస్‌లకు, అటవీశాఖలకు సమానంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అటవీశాఖ అధికారి జి సతీష్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ జి జ్ఞానప్రకాష్‌రావు, వెంకటగిరి రేంజ్ అధికారి బి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

‘సాగరమాల’ నిర్మాణానికి సహకరించాలి



రైతులతో సమీక్షిస్తున్న తహసీల్దార్

చిల్లకూరు: సాగరమాల రహదారి నిర్మాణానికి రైతులు సహకారం అందించాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని చింతవరం సచివాలయంలో సాగరమాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చింతవరం ప్రాంతంలోని రైతులు ఇంకా వారి అనుమతి తెలియజేయలేదని, దీనిపై పలు మార్లు సమీక్షలు నిర్వహించినా రైతుల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదన్నారు. ఈ దఫా రైతుల నుంచి సమాధానం తీసుకుని పరిహారం విషయంలో ఏవైనా ఇబ్బంది ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. వరగలి ఎంపీటీసీ సభ్యుడు దారా కోటేశ్వరరావు, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ (ఇన్‌సెట్‌లో) బీటలు వారిన ఫిల్లర్

ఓజిలి: మండలంలోని కురుగొండలో ఉన్న తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. 30 ఏళ్ల క్రితం ఈ ట్యాంక్‌ను నిర్మించారు. పదేళ్ల నుంచి తాగునీటి ట్యాంక్ పైభాగం పెచ్చులూడి ఇనుప కమ్మీలు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉంది. ట్యాంక్ ఫిల్లర్లు బీటలు వారాయి. ట్యాంక్ పైభాగం నుంచి పెచ్చులూడి పడిన సంఘటనలు ఉన్నాయి. ట్యాంక్ చుట్టూ ఇళ్లు, సహకారం సంఘం, పాఠశాల ఉండటంతో ఎప్పుడు ప్రజలు తిరుగుతుంటారు. దీంతో ట్యాంక్ ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ కూలిపోతే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ట్యాంక్‌ను కూల్చివేసి, కొత్త ట్యాంకు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటి ముంగిటకే పింఛన్



సైదాపురంలో పింఛన్ నగదును అందజేస్తున్న చేస్తున్న వలంటీర్ కుమారి



సైదాపురం: పింఛన్ అందిస్తున్న వలంటీర్ హుస్సేన్‌బీ

సైదాపురం: మండలంలోని 31 పంచాయతీల్లో గురువారం ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల ముంగిటే వలంటీర్లు పింఛన్లు అందజేశారు. కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఇంటి తలుపు తట్టి వలంటీర్లు పింఛన్లను అందజేశారు. ప్రతి పంచాయతీలో సర్పంచ్‌తో అధికారులు కూడా హాజరై పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం గురించి వివరించారు.

78 శాతం పూర్తి

చిల్లకూరు: మండలంలో గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ సుమారు 78 శాతం పూర్తి చేసినట్లు మండల అధికారులు తెలిపారు. మండలంలోని 31 పంచాయతీల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు.

నూరుశాతం పంపిణీ చేయాలి

ఓజిలి: మండలంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని రాచపాళెం, గుర్రంకొండ, ఆర్మేనిపాడు, చిలమానుచేను గ్రామాల్లో సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం తనిఖీ చేసి, లబ్ధిదారులను వివరాలు అడిగారు. ఆయన మాట్లాడుతూ బయట గ్రామాలకు వెళ్లిన లబ్ధిదారులకు పింఛన్లను అందించాలన్నారు. మండలంలో 70 శాతం పింఛన్లు పంపిణీ చేశాయని తెలిపారు.



చిల్లకూరులో..



వీర్లగునపాడులో..